# పిచ్చి మనుష్యులు

## పులికంటి కృష్ణారెడ్డి



మా యింటి ఎదురుగా ఓ డాక్టరున్నాడు. మా వీధిలో యిద్దరు ముగ్గురు డాక్టర్లున్నారు. మా ఊళ్లో చాలమంది డాక్టర్లున్నారు.

మా ఊళ్లో వున్న డాక్టర్లకందరికీ నాలుగు చేతులు!

ఆశ్చర్యపడుతున్నారా? — అవసరంలేదు. పుట్టుక వరకు భగవంతుని దృష్టిలో అందరు సమానమే! అంటే – ప్రతి వ్యక్తికీ ఒక్క తల రెండు కళ్లు రెండు చేతులు.. యిలా యిచ్చాడు. ఒకరికి కారు మరొకడికి కాలి నడక ... ఒకనికి మేడ మరొకనికి చెట్టు నీడ యిచ్చిన పక్షపాతికి ఆకారాల మీద అధికారం చేజిక్కి వుంటే— ఈ ప్రపంచం ఓ ప్రదర్శన శాలగా తయారయ్యేది. బ్రతికిపోయాం వాడి అధికార భ్రష్టుడయ్యాడు కాబట్టి. అందు వలన అందరి కున్నట్లు మా ఊళ్లో డాక్టర్లకు కూడా రెండు చేతులే!—అయితే సంపాదన దగ్గరికి వచ్చేసరికి నాలుగు చేతులు!!

పిచ్చి మనుష్యులు! ఆపదలోవున్న వాళ్ళ బలహీనతలపై — బల ప్రదర్శన జరిపే వైద్యోనారాయణోహరులు! నిజానికి ఈ జీవితం మీద వొగటు, ఏమినెత్తిన కట్టుకొని పోతాం? అన్న వేదాంతం— ఈ డాక్టర్లకే బాగా ఒంటపట్టాలి. కారణం— ఎన్నో దిక్కులేని చావులు నిష్కారణమైన చావులు ప్రతిదినం వాళ్ళ కండ్ల ముందు ఎన్నో జరిగిపోతుంటాయి కాబట్టి. కానీ ఆ పరిజ్ఞానాన్ని పక్కకునెట్టి రోగుల డబ్బుతో భోగాలనుభవించడం పిచ్చితనం కాక మరే మవుతుంది? అందుకే ఆసుపత్రిలో జీతగాడి వేషంలో రెండు, యింట్లో సొంతగాడి వేషంలో రెండు వెరశి వాళ్లకు నాలుగు చేతులు. ఆలూ మొగుడు యిద్దరు డాక్టర్లయితే నాలుగు నాలుగు ఎనిమిది చేతులు!

అయితే మా యింటి ఎదుటి డాక్టరు గారికి మాత్రం రెండే చేతులు. అభ్యుదయ భావాలు కలిగిన ఆ డాక్టరు మంచి మనిషి. సేవది చేయగలిగేది ఏదో ఆ రోగి నారాయణ సేవ ఆసుపత్రిలోనే రెండు చేతులకే పరిమితం చేసుకొన్నట్లుంది. అందువలన అతని యిల్లు ఉదయంకానీ సాయంత్రంకానీ ప్రశాంతంగా వుంటుంది. మా యింటి ప్రక్కన ఓ పండ్ల మండీ వుంది. దానిని చూచి మరొకటి మా యింటికి కాస్త దిగువగా వెలిసింది. ఈ రెండింటిని చూచి వరుసగా మూడు... నాలుగు...ఒక్కదాని వెంబడి మరొక్కటి పండ్ల మండీలు ప్రారంభింప బడ్డాయి. మా వీధి పేరు బండ్లవీధి. అదికాస్త పండ్ల వీధిగా మారింది.

మావీధి కిటువైపు అటువైపు పెద్ద పెద్ద సిమెంటు కాలువలున్నాయి. అవి మురుగు కాలువలు. మొలలోతున్న మురుగు కాలువలు!

పండ్ల మండీల ప్రముఖులు కుళ్లి పోయిన చెడిపోయిన పండ్లను ఆ కాలువల్లో కుమ్మరిస్తుంటారు. అమ్మలక్కలు చెత్తా చెదారాన్ని పోస్తుంటారు. చిన్న పిల్లలు చొక్కా నిక్కరు విప్పి ఆ కాలువ గట్లమీద కూర్చుంటారు. కలిగినవాడు పెట్టే బాధల్ని లేనివాడు భరించినట్లు అన్నింటిని తమలో యిముడ్చు కొంటుంటాయి ఆ మురుగు కాలువలు. అయితే అప్పుడప్పుడు కసిదీర నసాళాలు అంటుకొనేటట్లు దుర్గంధాన్ని అంటిస్తుంటాయి!

మా యింటి ముందు ఓ పిచ్చిది తిరుగాడుతూ ఉంటుంది,

## పిచ్చిమనుష్యులు

మా యింటి ముందరి ప్రదేశానికి ఆ పిచ్చిదానికి ఏదో ఋణానుబంధం వున్నట్లుంది. నాలుగు గోడల మధ్య వగ్నంకోసం నాలుకలు తడుపుకొనే ప్రబుద్ధులు దినములతో ప్రత్యక్ష మవుతున్న పిచ్చిదానిని భరించలేక పోయారు. అక్కడినుండి దానిని తరిమివేయడానికి చాల ప్రయత్నాలు చేశారు. అది కూర్చున్నచోట మంచినీళ్ళు కుమ్మరించారు. ఉడుకునీళ్ళు చల్లారు. కొట్టారు. పెద్దలే యిలా వ్యవహరించే సరికి పిల్లలు ఉడుకుమోతుతనంతో రాళ్ళు రువ్వారు. చిల్లపెంకులు, గాజుపెంకులు విసిరారు. వింత చేసినా ఆ పిచ్చిది అక్కడి నుండి


# చర్మవ్యాధులకు



# అతి గాఢంగా పనిచేసే అమృతాంజన్ డెర్మల్ ఆయింట్‌మెంట్

చర్మవ్యాధులకు ఉపయోగపడే సాధారణ ఆయింట్‌మెంట్లు ఎక్కువగా చర్మం లోపలికి ప్రవేశించలేవు. కాని అమోఘమైన చర్మరోగ నివారణ ఔషధాలు విశిష్టంగా చేరిఉండటంచేత అమృతాంజన్ డెర్మల్ ఆయింట్‌మెంటు మాత్రమే లోపలికి ప్రవేశిస్తుంది. సాధారణ చర్మవ్యాధులను అతి శీఘ్రంగా నిర్మూలించి చర్మాన్ని పూర్వస్థితికి తెచ్చి సహజంగాను ఆరోగ్యవంతంగాను ఉంచుతుంది.

అమృతాంజన్-డెర్మల్ ఆయింట్‌మెంట్ తామర, గజ్జి, దురద ఇతర చర్మ రోగాలకు అవశ్యమైన నివారిణి.

నేడే ఒకటి కొనండి!



**అమృతాంజన్ లిమిటెడ్** ([illegible] మద్రాసు 600 004)

SAA/AM/1906 RI TEL

కదలలేదు. అంతటితో మా యిరుగుపొరుగు అలిసిపోయారు!

ఆ పిచ్చిది మా ఇంటి వాకిట మెట్లపై కూర్చుంటుంది. ఎదురుగా డాక్టర్ యింటి ముంగిట తిన్నెపై పడుకొంటుంది. లేకుంటే డాక్టర్ యింటికి సరిగ్గా తూర్పు దిశన నాలుగో యింటి ముందర విశాలమైన రెండు తిన్నె లున్నాయి. ఆ తిన్నెల్ని ఆశ్రయిస్తుంది.

దాని తలలో కాకులు కాపురం పెట్టవచ్చు. ఒంటిమీద జానెడు తుండుగుడ్డ అడ్డంగా వుంటే వుండవచ్చు. లేకపోతే దానంతట అది ఊడి పడిపోవచ్చు. ఆ పిచ్చి దానికి ఆ ధ్యాసే వున్నట్లు కనుపించదు. నిద్ర వడితే తన్నెలమీద పడి నిద్రపోతుంది. లేకుంటే ఏ వాకిట మెట్లమీదనో కూర్చుని విటో చూస్తూ ఆలోచిస్తూ వుంటుంది. అప్పుడప్పుడు అర్థంకాని భాషలో వాగుతూ ఉంటుంది. ఉన్నట్లుండి నవ్వడం... కోపగించుకోవడం ... మూతి బిగించి కూర్చోవటం... ఈలాంటి పిచ్చి చేష్టలన్నీ మామూలే!—

ఎవరైనా ఏప్పుడైనా దాని మొగాన పిడికెడు కూడు విదిలించి వట్లుకానీ అది తింటున్నట్లు కానీ నా కంట పడలేదు. ఆ మురుగు కాలువల్లో దిగుతుంది. దేవులాడుతుంది. కుళ్ళిందో చెడిందో చేతికి దొరికిన పండు తింటుంది. ఆ కాలువలో నీళ్లే తాగుతుంది.

తన పిచ్చి లోకంలో అదొక సర్వాధికారి. ఈ లోకం దృష్టికి అదొక అనాకారి. తన లోకమేదో తనకే కానీ ఈ లోకం సంగతి ఏమాత్రం పట్టింపు లేదు. అందువలన పిల్లలు దానిని చూచి భయపడరు. అజాగ్రత్తగా వుంటే ఏమైనా వస్తువులు పట్టుకపోతుందేమో ? అని పెద్దవాళ్ళు దిగులుపడరు.

అలాంటి పిచ్చిది ఉన్నట్లుండి ఓ అర్ధరాత్రివూట అరచింది, 'అయ్యో! కుయ్యో!' అని అరచింది. 'ఏంజరిగిందో ?' అని లేచి బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటూ నిద్రమత్తులో ఊగుతూ బయటికి వచ్చేసరికి ప్రోగైన మానవోత్తములు కొందరు సానుభూతి చూపిస్తున్నారు. మరికొందరు 'ఛీ ఛా!' అంటున్నారు.

ఎవడో రిక్షావాడు, వీధి విద్యుద్దీప కాంతుల్లో నగ్నంగా పడి వుండిన పిచ్చిదాన్ని చూచి బలెమంచి చొకబేరమని కక్కుర్తి పడ్డాడు. అది అరచింది. వాడు బెదరిపోయాడు. అంతలోనే యిరుగు పొరుగు ప్రోగయ్యేసరికి పారిపోయాడు.

ఆ రాత్రి ఆ పిచ్చిదాని మీద అమాంతంగా సానుభూతి కట్టలు తెంపుకుని ప్రవహించింది మా యిరుగు పొరుగు వాళ్ళకు!

ఓ మానవతి అప్పటి కప్పుడే పాత చీర నొకటి తెచ్చి చుట్టబెట్టింది. మరొక మగువ సగం చినిగిన రవిక నొకటి తొడిగింది. ఇంకొక దయార్ద్ర హృదయిని కాకి గూటిని సరిచేయడానికి స్వయంగా పూనుకొంది. ఇంతమంది యిన్ని చేస్తుంటె ఆ పిచ్చిది కదిలీ మెదలకుండా కూర్చుంది బొమ్మలా! 'ఫరవాలేదు. పిచ్చిదానికి మానభంగానికి మాన సంరక్షణకు తేడా తెలిసినట్లుందే!' అనుకొన్నాను.

ఆ సంఘటన జరిగిన నాటినుండి మా యిరుగు పొరుగు హృదయాల్లో పిచ్చిది చోటు చేసుకొంది. ఇప్పుడది సాధారణంగా వివస్త్రగా కనుపించడమే లేదని చెప్పాలి.

అయితే డాక్టరుగారికి మాత్రం ఎనలేని కోపం!


మురుగు కాలువల్ని సరిగా శుభ్రం చేయని మునిసిపాలిటీ వారి మీద కాదు. మురుగు కాలువల్లో పారుతున్న నీటికి అంతరాయంగా కుళ్ళిన పండ్లను కుమ్మరిస్తున్న పండ్ల వ్యాపారస్థుల మీద కాదు, ముక్కులు పగిలేటట్లు దుర్గంధాన్ని వెదజల్లుతున్న మురుగు కాలువలమీద అసలే కాదు. మరెవరిమీద అంటే — ఆ పిచ్చిదాని మీద!

"చూడండి. అసలు యిలాంటి మనుషులు బ్రతకడం దండగే కాదు. అపాయకరంకూడా. దానికేం? కుళ్ళిన పండ్లు తింటుంది. మురిగిన నీళ్ళు తాగుతుంది. ఉత్తరోత్తర దానికి సంక్రమించే రోగాలకు సంఘం బలి అవుతుంది!" ఒకనాడు డాక్టర్ నాతో అన్నాడు.

"డాక్టరుగారూ! మనం ఎన్నో ఆరోగ్య సూత్రాలను పాటిస్తున్నామని అనుకొంటున్నాం. కానీ ఏదో ఒక రోగం వస్తుంటే వస్తూనే ఉంది. మరి ఆ పిచ్చిది మురుగుడు నీళ్ళు తాగుతూ కుళ్ళిన పుచ్చిన పండ్లు తింటూ దుక్కలా వుంది గదండీ" సందేహంగా ప్రశ్నించాను.

"దాని శరీరతత్త్వం సరుకుపోగలిగింది కాబట్టి యిప్పుడు దుక్కలాగే కనిపిస్తుంది. ఆ తత్త్వం మారినపుడు అంటే దాని ఒంట్లో రోగ నిరోధకశక్తి తగ్గినపుడు అది అంటు వ్యాధులకు నిలయ మవుతుంది. అపుడు రోగాన్ని అరికట్టడానికి ప్రయత్నాలు జరుగవు కానీ వ్యాప్తి అనర్థంగా కొనసాగుతుంది."

"డాక్టరుగా మీ మాటలు సమంజసముగాను, అంగీకార యోగ్యముగాను వున్నాయి. నేను కాదనడం లేదు. అయితే ఈ సృష్టి అతి విచిత్ర మయింది కదండీ! ఎవరెవరు



## కావలెను

గవర్నమెంటు వారు నడుపుతున్న తెలుగు వ్యవసాయ పరీక్షలో ప్యాసయి, ఇండియా మొత్తములో ఫీల్డ్‌మేన్, సూపర్‌వైజర్స్, మేస్త్రీలు, గ్రామసేవకులు, ఉపాధ్యాయులుగాను హైస్కూల్సునందు పంచాయితీ ఆఫీసులలోను పనిచేయు అర్హులు. కుట్టు మిషన్ శిక్షణ వేరులో పొంది కుట్టు మిషన్ టీచర్స్ మొదలగు ఉద్యోగములలో చేరి నెల 1 కి రూ. 290— నుంచి రూ. 450 వరకు జీతము పొందవచ్చును. పై శిక్షణ పొందుటకు 8 తరగతి నుంచి బి.ఏ., బి. ఎస్‌సి., వరకు చదివిన స్త్రీ, పురుషులకు వేరుగా గాని, లేక తపాలా మూలముగాని పాఠములు బోధించబడును. శిక్షణాకాలపరిమితి 3 నెలలు. శిక్షణ కాలములో కావలసిన నోటుబుక్స్ మరియు ఇతరత్ర కాలేజివారిచే ఇవ్వబడును. స్త్రీ, పురుషులకు వేర్వేరు హాస్టల్ వసతులు గలవు. ఇక్కడ శిక్షణ పొందువారికి స్టయిఫండు రూ. 150—ఇవ్వబడును. క్రింది విలాసమునకు 10 దినములలోపల రూ. 2— ఎం. ఒ. లేక పోస్టల్ ఆర్డర్స్ పంపి దరఖాస్తు మరియు వివరములు పొందవచ్చును.

**PRINCIPAL**

**Technical Agricultural Training College,**
28, Ramanujakudam Street. Poonamallee,
Madras - 600 056, Phone: 69315.







# పిచ్చిమనుష్యులు

ఎందుకిలా బతుకుతున్నారో? అసలు ఎందుకిలా అవుతున్నారో? అది అంతు తెలియని ఈ సృష్టిలో ఇలా ఎందుకుజరుగుతూందో నిర్ణయించడం చాలా కష్టం కదండీ?" నా అనుభవంతో శాస్త్రాన్ని ఎదుర్కోవాలని ప్రయత్నించాను.

"ఇదో యిలాంటి పిచ్చి వేదాంతాలు మాట్లాడే పిచ్చి మనుషులకు మనలో కొదువలేదు కాబట్టే ఈ సమాజం యిలా అఘోరిస్తూ వుంది" మొగం చిట్లించుకున్నాడు డాక్టర్.

"అయితే యిలాంటి వాళ్ళని యేం చేయాలంటారు?"

"ఏం చేయాలంటారా?... ఏం చేయగలం మనం? వాళ్ళని బాగుపరచే శ్రద్ధా ఓపిక మనకుగానీ మన ప్రభుత్వానికిగానీ లేవు కాబట్టే యిలాంటి వాళ్ళను గప్‌చిప్‌గా చంపిపారేయడం మంచిది." గతుక్కుమనింది గుండె! డాక్టర్లు! ఎంతటికైనా సమర్థులు. అప్పటికి వాదాన్ని ఆపుచేసుకొన్నాను.

అయినా నేను గమనిస్తూనే వున్నాను. దాదాపు వీధివాళ్ళందరికీ పిచ్చిదానిపట్ల సదభిప్రాయం కుదిరినా డాక్టర్ అభిప్రాయం మారలేదు. ఆయన కార్లో ఆస్పత్రికి పోతుంటాడు. వస్తుంటాడు. వస్తూపోతూ చూడకూడదనుకొంటూనే పిచ్చిదాన్ని చూస్తున్నాడు. ఆ పిచ్చిది మురుగు కాలవలో వంగి దేనికోసమో దేవులాడుతూ వుంటుంది. ఒక్కొక్కప్పుడు ఆ కాలువలో చేతికి దొరికిన కుళ్ళిన పండును ఆప్యాయంగా పీక్కుతింటూ వుంటుంది. శరీరం గగుర్పొడుస్తుంది డాక్టర్ బాబుకు. మొగం చిట్లిస్తాడు. ముక్కు కడ్డంగా చేతిరుమాలు పెట్టుకొంటాడు. అడుగులు గబగబ ముందుకు వేస్తాడు ఆ పాడు దృశ్యాన్ని చూడలేనన్నట్లుగా!

ఆ దృశ్యం నాకంట పడినపుడంతా నా గుండె గుభిల్లుమనేది. అదొక పిచ్చిది. దాని లోకం దానిది. ఎవరి జోలికీ రాదు. ఏమీ ఆశ్రయించదు. ఎప్పుడో దానివల్ల జరుగబోయే ప్రమాదాన్ని ఊహించుకొని డాక్టర్ దాన్ని చంపేస్తే? ఏముంది? కాసంత మాదిమందు, ఒళ్ళు తెలియకుండా అది అరుగుమీద పడి నిద్రపోతుంటుంది.

ఒకరికంట పడకుండా ఏ అర్ధరాత్రివేళో దానికంత సూదిమందు ఎక్కిస్తే... అడిగే వాళ్ళెవరు ? దానికోసం యేడ్చేవాళ్ళెవరు ? ఇలా ఆలోచిస్తూ వుంటే ఎందుకో గుండె జాలితో నిండిపోయింది.

ఓరోజు రాత్రి యిలాంటి ఆలోచనలతోనే పడుకొన్నానేమో ? 'డాక్టర్ !' అంటూ అరుస్తూ లేచాను అర్ధరాత్రి వేళలో. ఆ అరుపులకు శ్రీమతి ఎగిరిపడి లేచింది "ఏంజరిగిందండీ ? ఎందుకు 'డాక్టర్ !' అని అరుస్తూ లేచారు ? అని ఆతురతగా అడుగుతూ వుంది. నేను నెమ్మదిగా లేచాను. వీధి తలుపు తెరచి వీధిలోనికి చూశాను. డాక్టర్ యింటి తిన్నె మీద పిచ్చిది ఆదమరచి పడివుంది. ఏన్నడూ లేనిది ఆవేళప్పుడు డాక్టర్ యింట్లో దీపం వెలుగుతూవుంది ! చిన్నపిల్ల యేడుపు చెవుల్లో గంట కొట్టినట్లు వినిపిస్తూ వుంది. ఆ నిశ్శబ్ద నిశీధిలో ! ... గుండె కదుటపడింది. తిరిగి తలుపు వేసుకొని యింట్లోకి వచ్చాను కాసిని మంచినీళ్ళు గొంతులో పోసుకొన్నాను.

"ఏమండీ ? ఏంజరిగిందండీ ?" శ్రీమతి ఆందోళన పడుతూ వుంది.

"ఎదురింట్లో డాక్టర్ రాజీ..."


"ఆఁ ! ఎదురింట్లో డాక్టర్..." అసహనంగా అడుగుతూ వుందామె.

"ఎదురింట్లో డాక్టర్ పిచ్చిదాన్ని చంపేయడానికి సూదిమందు తయారు చేసుకొన్నాడు రాజీ! అంతలోనే పసిపిల్ల కెవ్వుమని అరచింది. పిల్లతల్లి ఎగిరిపడి లేచింది. లేకుంటే ఈనాటితో పిచ్చిదాని పని గోవిందా !" కడుపు చెక్కలయ్యేటట్లు నవ్వింది మా శ్రీమతి.

"ఏం పిచ్చి మనుషులండీ మీరు. డాక్టరుగారికి పిచ్చిదానికి యేం సంబంధం? ఆయనగంగిగోవులాంటిమనిషి.ఆయనెందుకు చంపుతాడండీ మీ పిచ్చిగానీ! పడుకోండి." అంటూ బలవంతంగా పడుకోబెట్టి దుప్పటి కప్పింది పాడు కలలు దుప్పట్లో దూరలేవని! పాడు కలలకు దుప్పటికి సంబంధ ముందో ఏమోకానీ ఆమె దృష్టిలో— నా దృష్టికి ఎండాకాలనికీ దుప్పటికి సంబంధం లేదు కాబట్టి పీకిపారేసి పడుకొన్నాను. తెల్లవారింది. ఇలా తెల్లవారడం మామూలయింది.

# పిచ్చిమనుష్యులు

మనుష్యుల ఆకారాల్లో పెద్ద పెద్ద వ్యత్యాసాలు కనుపించవు. అయినా బుద్ధులు వింతలు వింతలుగా వ్యక్తిస్తుంటాయి. అలానే కాలగమనంలో పెద్ద మార్పు కనుపించదు. కానీ వాతావరణం రకరకాలుగా ఉంటుంది. ఈయేడు ఏయేడూ లేనంత విపరీతమయిన ఎండలని ప్రజానీకం గోలచేస్తూ వుంది. ఎండధాటికి నిప్పుపడి కొంపలు కాలిపోతున్నాయి. త్రాగడానికి నీళ్ళులేక గ్రామాలకు గ్రామాలే వలస వెళ్ళుతున్నాయి. వడగాడ్పులకు జనులు బలి అవుతున్నారు. త్రాగడానికే నీళ్ళు కరవైనప్పుడు మురికి కాలువల సంగతి చెప్పాలా ? చెత్తా చెదారం, కుళ్ళిన




పండ్లు పేడా పెంటలకు నిలయమయ్యాయి. వాటివైపు చూడవలెనంటే ఒళ్ళు జలదరిస్తుంది. వాటిని భరించడం మహా కష్టంగా తయారయింది.

దీనికితోడు పండ్లవీధిగా మారిన బండ్ల వీధిలోనికి మామిడిపండ్లు లారీలమీద దిగుతున్నాయి. లారీల రాకపోకలతో రాల్చిన చెత్తా చెదారంతో వీధి రొచ్చు రొచ్చుగా తయారయింది. కుళ్ళిన పండ్లను కండ్లు మూసుకుని కాలువల్లో కుమ్మరిస్తున్నారు. వాననీళ్ళో లేక యిండ్లల్లో కుండా, చట్టీ కడిగిన నీళ్ళో ధారాళంగా ప్రవహిస్తుండే కాలువల్లో దుర్గంధము ఎప్పటికప్పుడు కొట్టుకపోయేది. ఇప్పుడంతంత మాత్రంగా యిండ్లల్లో నుండి కాలువల చేరుతున్న కడుగునీళ్ళు కాలువల్లో పడిన చెత్తా చెదారం కుళ్ళిన పండ్లు మరింత కుళ్ళడానికి ఉపకరిస్తున్నాయి.

ఓ రోజు మధ్యాహ్నం. చుట్టపురీతిగ పలుకరించడానికి వచ్చినట్లు నాలుగు తొలకరి చినుకులు రాలాయి. అసలే రొచ్చు రొచ్చుగా వున్న నేల. చినుకులు పడడంతో కాలు పెడితే జారుతుందన్నట్లుగా తయారయింది.

బాగా వర్షం కురిసివుంటే కాస్త చల్లబడి వుండేది. కళ్ళాపుచల్లినట్లు చిలకరింపుతో లోపలివేడి లేపి కొట్టింది. గంట నాలుగైనా బయట అడుగు పెట్టవలెనంటే భయమేస్తూ వుంది. కాస్త చల్లబడితే వెళ్ళవచ్చులే! అని ఎదురుచూస్తూ ఏదో ఆలోచిస్తూ కూర్చుని ఉన్నాను యింట్లోనే!

"అయ్యో ! బిడ్డ!!"— అన్న గావు కేక వినిపించింది.

"ఎవరిబిడ్డ ? ఏమయింది బిడ్డకు ?" అన్న ఆతురతతో ఎగిరిపడి లేచాను. వీధిలోనికి వెళ్ళవలసిన వాడిని యింట్లో కలయ చూశాను. బిడ్డలందరు యింట్లోనే వున్నారు. మనసు కుదటపడితే ఆ తరువాత నేను వీధిలో పడ్డాను. మనిషి స్వార్థం అలాంటిది మరి !

అప్పటికే కాలువచుట్టూ జనం ప్రోగైనారు. కాలువగట్టు మీద కాలు గాలిన పిల్లుల్లా తిరుగుతూ 'అయ్యో ! బిడ్డ !... అయ్యోబిడ్డ !" అంటున్నారు.

తప్పటడుగులు వేస్తూ వీధివాకిట్లోకి వచ్చిన డాక్టర్‌గారి మూడేండ్ల ముద్దుల పాప !... ఎలా జారిపడిందో ?— కాలువలో పడిపోయింది. కుళ్ళిన పండ్లు ... చెత్తా చెదారం... పెంటతో మురుగుకాలువ రొచ్చు రొచ్చుగా వుంది. చూస్తే ఒళ్ళు జలదరిస్తూ వుంది. ఆ రొంపిలో బిడ్డ బోర్లపడి కూరుక పోయింది. గుక్కతిప్పుకోలేక పోతూంది.

డాక్టర్ బాబుగారు వచ్చారు. వారి శ్రీమతి వచ్చింది. అందరితో కలిసి 'అయ్యోబిడ్డ ! అయ్యోబిడ్డ !' అంటూనే వున్నారు. కాలువగట్టు మీద భరతనాట్యం చేస్తున్నారు. డాక్టరుగారు వారి సతీమణి ముక్కుకు చేతిరుమాలు అడ్డం పెట్టుకోవడం అరక్షణం వదలలేదు. ఆరోగ్యంపట్ల

వనితలకు మనవి

కొత్తరకం వంటలు
క్లుప్తంగా వ్రాసి పంపితే
త్వరగా పరిశీలించ వీలు —సం.



## వైద్యము

నత్తియుందా? బాగుగా మాట్లాడు టకు డా. సూరత్‌కర్ "అంటిస్టామర్ సెట్టు" వాడండి. అనేకులు లాభ పడ్డారు. ఉత్తరాలు ఇంగ్లీషులో వ్రాసి, 50 Ps. Stamp జతచేసి పంపండి.

**Ramakant Brothers,**
480, Shanwarpeth, Pine-411030.







## సైన్సులో సరదాలు

# మాయమైన షర్బత్తు

ఈ గారడీ చేయడానికి రెండు గాజు గ్లాసులు, ఎర్ర సిరా, చిటికెడు బ్లీచింగు పౌడరు కావాలి.

మొదటి గ్లాసులో సగం వరకూ ఎర్రసిరా కలిపిన నీళ్ళుపోసి ఉంచు. చిటికెడు బ్లీచింగు పౌడరు పది చుక్కల నీళ్ళల్లో కరిగించి రెండవ గ్లాసులో పోసి ఉంచు. పైకి చూడడానికి రెండవగ్లాసు ఖాళీగా కనిపిస్తుంది.

మొదటి గ్లాసులో ఉన్న ఎర్రసిరా నీళ్ళని చూపించి, అది కొత్తరకంషర్బత్తు అని చెప్పు మీ స్నేహితులతో. వాళ్ళు చూస్తూ వుండగా మంత్రంవేసి, ఆ "షర్బత్తు"ను రెండవ గ్లాసులో పొయ్యి. అంతే, రంగు మాయమై షర్బత్తు నీళ్ళల్లా మారిపోతుంది!

ఈ రకమైన గారడీ మీలో చాలా మంది చాలాసార్లు చేసే వుంటారు. కాని, అది గారడీ అని గమనించి వుండరు. చొక్కాలకి పట్టుకున్న సిరా మరకలు పోగొట్టడానికి చేసే పద్ధతి ఇదే. అయితే ఈ గారడీ ఎల్లా జరుగుతోంది?

బ్లీచింగు పౌడరులో క్లోరిన్ అనే ధాతువు ఉంది. నీటి అణువులో ఆక్సిజన్, హైడ్రొజన్ అనే పరమాణువులున్నాయి. క్లోరిన్ వెళ్ళి నీటిలో ఉన్న హైడ్రో-జన్‌తో కలుస్తుంది. మిగిలిపోయిన ఆక్సిజన్ పరమాణువులు బహుశ మరుక్కెన అవి వెళ్ళి రంగులతో కలిసి, వెలిసిపోయేలా చేస్తాయి.

అంటే రంగు పోగొట్టినది బ్లీచింగు పౌడరు అనడంకన్న ఆక్సిజన్ పరమాణువు అనడం సబబుగా ఉంటుందేమో.

— డాక్టర్. మహీధర నళినీమోహన్.

# పిచ్చిమనుష్యులు

అంత శ్రద్ధ మరి! నాగరకత ముసుగు వేసుకొన్న మనుష్యులు కదా?

ఆ పెంటలో దిగడానికి అందరూ వెనుకాడుతూనే ఉన్నారు. అలా ఉపేక్షిస్తూ కూర్చుంటే ఆ బిడ్డమీది ఆశలు వదలు కోవలసి వచ్చేటట్లుంది. దిగుదామా? అని ప్రయత్నిస్తున్నాను. అంతలోనే పిచ్చిది ఆ కాలువలో దేవులాడుకొంటూ వస్తున్నది. చేతికి అడ్డు తగిలిన చెత్తను తీసిపారేసినట్లు విడమ చేత్తో ఆ బిడ్డను అవలీలగా ఎత్తి గట్టుమీద విసరింది. ఎవరివైపు చూడలేదు. ఏమీ పట్టించుకోలేదు. తన పని తనదన్న ట్లుగా కాలువలో ఏదో దేవులాడుకొంటూనే వుంది.

డాక్టర్‌గారి భార్య బిడ్డను ఐపురుకొని లోనికి పరుగెత్తింది!

"ఎక్కడుండిందో! వనమయానికి దేవతలాగావచ్చి బిడ్డను బతికించింది" గుమి గూడిన అమ్మలక్కలు పిచ్చిదాన్ని మెచ్చు కొంటున్నారు. ఈ మాటలకు పొగడ్తలకు అతీతంగా పిచ్చిది మురుగు కాలువలో దేవులాడుతూనే వుంది!

మా శ్రీమతి దృష్టిలో నేను పిచ్చివాడిని. నా దృష్టిలో డాక్టరు పిచ్చివాడు. లోకం దృష్టికి అది పిచ్చిది. ఆ మాటకు వస్తే ఎవరి పిచ్చి వాళ్ళ కానందము!

చేతికి దొరికిన కుళ్ళిన పండును ఆప్యా యంగా పీక్కు తింటూ వుంది మురికి కాలు వలో పిచ్చిది! అది దాని కానందము!!

'ఎవరెవరు? ఎందుకు? యిలా బతుకు తున్నారో? అందులో అంతరార్థ మేమిటో సృష్టి చిత్రం?' అని నే చెప్పినదో డాక్టరు గారితో అన్న మాటలు మరొక్కసారి మనసులో మెదిలాయి. డాక్టర్ వైపు చూశాను.

డాక్టర్ తల వంచాడు. అయినా అతని కనుకొలకుల్లో తిరిగిన అశ్రుకణాలను నేను గమనించకపోలేదు. పాపం! పిచ్చిమనిషి!!